


# అంతా ఇంతే...

శంకరమంచి పార్థసారథి

నాయుడుగారికి ఎన్నడూ లేనిది కొడుకు సుబ్బారావుమీద మొదటిసారిగా కోపం వచ్చింది. కొడుకు ఏమైపోతాడో అన్న భయం మొదలైంది. ఆయనలో ఈ భావాలన్నీ కలగటానికి కారణం, సుబ్బారావు స్నేహితుడు ఆచారి అందించిన సమాచారం.

మొదటినించీ గూడా నాయుడుగారు కొడుకుని చాలా గారాబంగా పెంచుకుంటూవచ్చారు. ఎప్పుడూ పల్లెత్తు మాటనలేదు. చదువు విషయంలో గూడా. సుబ్బారావు ఒకో క్లాసులో రెండు మూడేళ్ళు తీరుబడిగా కూర్చుండిపోయినా, ఏమనకపోగా చాలా సహనంగా చదివించుకుంటూ వచ్చారు. కొడుకు కాలేజీలో చేరగానే నడిచెడితే ఎక్కడ అరిగిపోతాడో అని చిన్న సైజు కారు కొనిచ్చారు. ఆ కారులో ఆయిలు నింపటానికి అతగాడి జేబులు ఎప్పటికప్పుడు నింపుతూనే వచ్చారు. ఇదంతా ఎందుకు చేసారంటే, ఏదో కొడుకు చదువుకుని, వాడు బాగుపడి, తననిగూడా బాగుచేస్తాడని ఆశించి....అంతేగాని ఇలా తగులడతాడని తెలిస్తే అసలు చదివించేవారా? ఇంత డబ్బు అతగాడి మీద ఖర్చుపెట్టేవారా?

ఇంతకీ నాయుడుగార్కి అంతగా కోపం తెప్పించిన విషయం, ఆచారి అందించిన సమాచారం ఏమిటంటే—

మామూలుగా, ఆచారి సుబ్బారావు కోసం అతడు లేని సమయంలో రావటంతో నాయుడుగారు అతడ్ని కూర్చోపెట్టి మెల్లిగా కబుర్లలోకి దింపి, చదువు లెట్టావున్నాయని అతి మామూలుగా అడిగారు.

ఆచారి ఆ ప్రశ్నకి జవాబివ్వకపోయినా, మాట్లాడకుండా వూరుకుండిపోతే బాగుండేది.

కాని ఆచారి అలా వూరుకోక అసలు విషయం ప్రక్కనపెట్టి ఇంకో విషయం కదిపి నాయుడు గారి ఆందోళనకి పరోక్షంగా కారకుడయ్యాడు.

"మీవాడి సంగతి మీకు తెలీదులావుంది. కాలేజీలో వాడికి ఎంత పేరు! అమ్మాయి లందరికీ వీడు ఆదర్శ పురుషుడండి!" గొప్పగా పేలాడు.

అసలా ఆచారి ఎవర్ని గురించి మాట్లాడుతున్నాడో అర్థం కాక "ఎవరు మావాడా? ఎందుకని" ప్రశ్నించాడు.

"అవునండి సుబ్బారావే! మొన్నీ మధ్య 'వరకట్న నిషేధం' అన్న విషయంపై గంటసేపు ఏకబిగిన మాట్లాడేసి, మోచేతి ప్రమాణంగల కప్పు గెల్చాడు; మీకు తెలీదులా వుంది" తనే గెల్చినంత సంతోషంగా చెప్పాడు.

అప్పుడే నాయుడుగారి ఆందోళనకి అంకురంపడ్డది. అందుకే "వూ! (ఏడవ లేక పోయాడు!)" మూలిగారు.

నాయుడుగారి 'వూ' లోంచి వూపిరి తీసుకుని ఆచారి మళ్ళీ, "అంటే మీకు ఇదిగూడా తెలీదా?" అడిగాడు.

"ఇంకేమిటి?" మళ్ళీ ఏం వినాల్సివుంటుందోనన్న బాధతో అడిగారు.

"ఆడపిల్లలు వివాహానికి పూర్వం....సోషల్‌గా వుండొచ్చునా—కూడదా? అన్న విషయంపై ఆరు పేజీలు వ్రాయమని వ్యాస రచన పోటీ పెడితే, మనవాడు అరవై పేజీలు ఏకి పారేశాడు."

"ఎవరిని;"

"ఎవర్నేవిటండీ—సాంప్రదాయాన్ని, ఆచారాలని, పెద్ద వాళ్ళ సంఘాన్ని, ఈనాటి వివాహ వ్యవస్థని."

"అంటే మావాడు ఇంకో మోచెయ్యి సైజు కప్పు గెల్చాడన్నమాట (వీడిట్టాతగులడి పోతున్నాడేం?)"

"ఈసారి కప్పివ్వ లేదనుకోండి—ఓ సర్టిఫికేట్ ఇచ్చారు. అప్పటినించి ఆడపిల్లల పాలిటి దేముడై కూర్చున్నాడు సుబ్బారావు."

"కూర్చుంటాడు—ఎందుకు కూర్చోడు? చదువుకి పంగనామాలెట్టేసి వెధవ్వేషాలూ వీడూసూ" ప్రకాశంగానే అక్కసుని వెళ్ళబోసుకున్నారు.

మారిన వాతావరణాన్ని గమనించిన ఆచారి మెల్లిగా తప్పుకున్నాడు.

నాయుడుగారు బాధపడిపోతున్నది సుబ్బారావు చదువుకి పంగనామాలెడుతున్నాడని కాదు. అకడిలో వచ్చిన, వస్తున్న మార్పుల గురించి. 'వరకట్నం కూడదని వాదించాడట, దానికి ఆ కాలేజీ వెధవలు పొంగిపోయి కప్పిచ్చారుట. రేపు నిజంగా వాడు కట్నం తీసుకోనంటే తనగతేం కావాలి? వీడిని నమ్ముకుని వచ్చే సంవత్సరం రెడ్డి ప్రారంభించబోయే వ్యాపారంలో తాను గూడా భాగం కలుస్తానని మాటిచ్చాడే? తన మాటేం కాను?'. అప్పటినించి ఆయన కొడుకు గురించి వాకబు చేయటం మొదలెట్టారు. ఈ ఆందోళనని, బాధని ఒక్కరూ భరించలేక, ఒక రోజు భార్య సావిత్రమ్మతో—

"వీడికి పెళ్ళి చేసేస్తే పోతుందేమో?" అన్నారు.

"వాడి పెళ్ళికి అప్పుడేం తొందరండి—చదువు కానీండి" అన్న భార్య వంక మింగేలా చూసేస్తూ,

"మనవాడి చదువు అయిపోవటం అంటూ లేదు. అలా చదివేస్తూనే వుంటాడు ఎన్నేళ్ళయినా. అయినా వీడేం చదివి దేశాన్నేలాలా? మంచి పిల్లనిచూసి పెళ్ళిచేస్తే కాస్త ఇంటిపట్టునన్నా పడివుంటాడు."

భర్త వుగ్ర రూపం చూసి భయపడి ఆవిడ "సరే మీ ఇష్టం" అంటూ పచ్చ జెండా వూపింది.

అప్పటినించి నాయుడుగారు సంబంధాలు చూట్టం మొదలెట్టారు (సుబ్బారావుకి తెలీకుండానే)

ఇంకో రోజు ఆయన బ్యాంకులో పన్చూసుకుని బయట కొస్తుంటే ఆచారి కంగారుగా వెడుతూ కనిపించాడు. అతగాడిని చూసి ఏం ఆశ్చర్య పోలేదుగాని, అతడి చేతిలోవున్న వస్తువుని చూసింతర్వాత మనస్సు పరిపరివిధాల



పోయింది. అందుకే వెంటనే,

"ఏవిటోయ్, అప్పుడే పెళ్ళికి కావాల్సినవన్నీ ఏర్పాటు చేసుకుంటున్నావా?" అని అడిగారు అతడి చేతిలో పెళ్ళి పీటని చూస్తూ.

"అబ్బె అది కాదు సార్...." చూడకూడని వ్యక్తిని చూసినట్లుగా బాధపడుతూ అన్నాడు.

"ఏవిటి, హోదావుడి?" రెట్టించి మళ్ళీ అడిగారు కాబట్టి తప్పక ఆచారి మెల్లిగా "మన వాడు—అదే సుబ్బారావండి—ఇవాళ పెళ్ళి చేయిస్తున్నాడండి" పెళ్ళి కబురు చల్లగా చెప్పాడు.

"ఎవరికి? నీకా?" గుండె నిండా గాలి పీల్చుకుంటూ అడిగారు.

"అబ్బె నాక్కాదండి—మా కాలేజీలో ఇద్దరు ప్రేమించుకున్నారండి. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు, కాని పెద్దలు అంగీకరించలేదు- అంటే వేర్వేరు కులాల వాళ్ళు లెండి—చివరికి మన సుబ్బారావు నడుం కట్టి, కానీ కట్నంగాని, ఖర్చుగాని లేకుండా గుళ్లో పెళ్ళి చేయిస్తున్నాడు. అదీ విషయం. వస్తానండి ముహూర్తం వేళవుతోంది" అంటూ ముందుకి పోబోయి ఆగి మళ్ళీ "సార్ నేచెప్పానని చెప్పకండి—గొప్ప రిస్కులో పడతా" అని చక చకా వెళ్ళిపోయాడు.

నాయుడుగారు చాలా సేపు అలాగే నిలుచుండి పోయారు. 'లాభంలేదు, వీడు పూర్తిగా కొరకరాని కొయ్యలాగా అయిపోతున్నాడు. ఇంకాలస్యంచేస్తే తనమాటే వినకపోవచ్చు' అనుకుంటూ ఇంటి దారి పట్టారు.

ఆ రోజునించి బుర్రలోవున్న అన్ని విషయాల్ని ప్రక్కకునెట్టి కేవలం కుమార రత్నం గూర్చే ఆలోచించటం మొదలెట్టారు.

నాయుడుగారికి రాజకీయ పరిజ్ఞానం చాలా వుంది. ఎన్నో రాజకీయ తుఫాన్లని చూసారు. పెద్ద మేధావులనబడే వాళ్ళని పిల్లిగింతలు కొట్టించేసారు. ప్రజల అదృష్టం కొద్దీ కాస్తలో తప్పిందిగాని లేకపోతే మంత్రి అవటానికి పూర్తి అర్హతలున్నవారు. కాని అంత విజ్ఞానం, అనుభవం వున్నా, కొడుకు సైకాలజీ ఏమిటో అర్థం చేసుకోలేకుండా వున్నారు. అందుకే ఆయనలో ఆయనే మధనపడసాగారు.

ఒకనాటి సాయంకాలం తిరిగి తిరిగి నాయుడుగారు ఇంటికి చేరుకునేసరికి, సుబ్బారావు ఎవరితోనో ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

ఆయన సద్దుచేయకుండా అలాగే ప్రక్కన వున్న కుర్చీలో కూర్చుని ఆలకించసాగారు.

"........ఒరే ఫూల్ మనం ఈ పెద్దవాళ్ళ 'ట్రాప్'లో పడకూడదురా! ఈ సంఘంలో ఆడదాని పరిస్థితి మెరుగుపడాలంటే దానికి మన లాంటి యువకులే నడుం కట్టాలి. ఈ వర కట్నం అన్నది ఒక జాడ్యంలాంటిది. తర తరాలుగా వస్తున్న ఒక పెద్ద అంటు రోగం. కట్నం తీసుకుంటున్నావంటే నిన్ను నీవే అమ్ముకుంటున్నా వన్నమాట! ఇన్నీ తెల్సి, ఇన్నాళ్ళుగా నా స్నేహంచేసి, చివరికి మానాన్న కట్నం తీసుకుంటా నంటున్నాడని అంటావా! సిగ్గులేదూ ఆ మాటనటానికి?" ఆవేశంగా చెప్పుకుపోతున్న సుబ్బారావు వుపన్యాసం విని నాయుడుగారు ఇంకో సందర్భంలో అయితే చప్పట్లు కొట్టేవారేమోగాని, ప్రస్తుతం మొఖానికి పట్టిన చెమటని కర్చీఫ్‌తో తుడిచి, వారి సంభాషణనివింటూ అలాగే కూర్చుండి పోయారు.

లోపల ఆచారి మెల్లిగా "అది కాదురా, నా పెళ్ళిచేసి, నా కట్నంతో నా చెల్లెలు పెళ్ళి చెయ్యాలట" సంజాయిషీ ఇస్తున్నట్లుగా అంటున్నాడు.

"ఇలాగే ప్రతివాళ్లు అనుకుంటే, మనం బాగుపడే దెప్పుడు? మనం ఆశించిన మార్పెలా వస్తుంది. ? ఆల్‌రైట్, నువు కట్నం లేకుండా పెళ్ళిచేసుకో! నీ చెల్లెలికి వరకట్నం అడక్కుండా ఎవ్వరూ రాకపోతే, నే చేసుకుంటా, సరేనా?. ..ఇంకో విషయం. నువు కులాంతర వివాహం చేసుకుంటావని ఆశించాను. ఆల్‌రైట్....గో ఎ హెడ్.... విష్ యూ ఆల్ ది బెస్టు. "

ఇక వారు బయట కొస్తారన్న అనుమానం గల్గి, వారి కంటపడటం ఇష్టంలేక నాయుడు గారు ప్రక్క గదిలోకి తప్పుకున్నారు.

అలాగే కుర్చీలో కూర్చుండి ఆలోచనల్లో మునిగిపోయారు.

"అసలు వీడు వల్లిస్తున్న ఆదర్శాలన్నీ ఆచరిస్తాడా? లేక తనలాగ చెప్పటం వరకేనా? అది రూఢీగా తెల్సుకోవాలి. ఒకవేళ చెప్పిన వన్నీ తు. చ. తప్పకుండా ఆచరిస్తానంటే తన పరిస్థితేమిటి? వాడిమీద కట్నం ఆశించక పోవటంవల్ల తనకెంత నష్టం? కట్నం మాట దేముడెరుగు, మరో కులం అమ్మాయిని చేసుకుంటానంటే, తన కర్తవ్యం ఏమిటి? వాడితో ఘర్షణపడటమా? లేక వాడి మార్గాన పోవటమా? ఘర్షణ పడటంవల్ల పెద్ద వుపయోగం వుండక పోవచ్చు—గుళ్లో పెళ్ళిళ్ళు చేయించినవాడు, తన పెళ్ళి చేసుకోలేడా? మరేం చెయ్యాలి?—ఏం లేదు—ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా వాడిని పిల్చి, 'నీకో సంబంధం చూశాను, మూడు లక్షలు కట్నం. మనవాళ్ళే-నువ్వు కూడా చూసి సరే అంటే' అనాలి అపుడువాడు 'నేను కానీ కట్నం తీసుకోను-సరిగదా ఇంకో అమ్మాయిని ప్రేమించాను' అంటాడు. ఆ సమయంలో మంచిగా బేరానికి దిగాలి...."

సావిత్రమ్మగారు గదిలో కొచ్చి లైటేసే దాకా అలా ఆలోచిస్తూనే వున్నారు.

నాయుడుగారికి ఒక నిర్ణయం తీసుకున్నాక దాన్ని వెంటనే అమలు పర్చటం అలవాటు. అందుకే,

"అబ్బాయి నోసారి పిల్చుకురా" అన్న ఆర్డరు జారీచేసి, ఆవిడటు వెళ్ళగానే, లేచి మంచంమీద పడుకుని, 'మూడ్స్‌లో' కొచ్చి, కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు.

సుబ్బారావు మెల్లిగా తల్లి వెనకగా వచ్చి, తండ్రి సంజ్ఞ ప్రకారం ప్రక్కనేవున్న కుర్చీలో కూర్చున్నాడు.

సావిత్రమ్మగారికి అంతా వింతగాను, ఆశ్చర్యంగానూ వుంది.

నాయుడుగారు మెల్లిగా లేని ఓపికని తెచ్చుకుంటున్నట్లుగా ఫీలింగ్ పెట్టి "నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని పిలిపించారా" అన్నారు.

"చెప్పండి."

"ఏం లేదు—నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. మీ కెవరికి చెప్పలేదుగాని, గుండె మహా

(వి) చిత్ర విజ్ఞానం




బలహీనంగా కొట్టుకుంటోంది (అబద్ధం!). ఏవేళటప్పుడు ఏంజరుగుతుందోనన్న బెంగే నన్ను రోజులోజుకి తినేస్తోంది (మళ్ళీ అబద్ధం!) అందుకే నేనుండగానే పెళ్ళిచేసి ఆ ముచ్చట కళ్ళారా చూడాలని ఆశగా వుందిరా!" మాట్లాడటం ఆపి భార్యా, పుత్రుల వంక, చూసారు.

వాళ్ళ దగ్గరనించి ఎటువంటి రియాక్షన్ లేకపోవటంతో మళ్ళీ అందుకున్నారు. "నా మాటని కాదనవన్న ధైర్యం వుంది బాబూ.అదే ధైర్యంతో ఓ సంబంధంగూడా చూసాను. లక్షణమైన పిల్ల, లక్షణమైన సంసారం, లక్షల కట్నం....నువు కూడా చూసి సరే అంటే ముహూర్తం పెట్టిద్దాం."

సావిత్రమ్మగారు కంగారుగా, "నాతో మాట మాత్రమైన అనలేదే?" అంది.

భార్యవంక మింగేసేలా చూసి, మళ్ళీ కొడుకుతో, "చెప్పు నాయనా, నీ అభిరుచులేమైనా వుంటే చెప్పెయ్" అన్నారు గారాబంగా. సుబ్బారావు మెల్లిగా, "నాన్నా, నాకు కొన్ని ఆదర్శాలున్నాయి. ఆదర్శవంతంగానే వివాహం చేసుకోవాలనుకున్నాను. కాని....మీరు కనబరుస్తున్న ప్రేమ ఆప్యాయతల ముందు తలొంచక తప్పటం లేదల్లే కనిపిస్తోంది. అయినా చూస్తుచూస్తూ నేను నమ్మినసత్యాలు, వల్లించిన ఆదర్శాలనీ వదిలెయ్యలేను. అందుకే ఓ నిర్ణయానికొచ్చాను" అని తండ్రివైపు చూసాడు.

నాయుడుగారికి నిజంగానే గుండె బలహీనమై పోయినట్లుగా అనిపించింది.

మెల్లిగా "చెప్పు నాయనా నీ నిర్ణయం ఏమిటో" అన్నారు.

సుబ్బారావు మళ్ళీ అన్నాడు "ఏంలేదు, నేనెటూ నిర్ణయించలేకపోతున్నాను. అందుకే రెండు కాగితాలమీద, రెండు పద్ధతులు వ్రాసి, అంటే ఒక కాగితంపై 'నాన్నమాట నేను వినాలి' అని, రెండో కాగితంపై 'నామాట నాన్న వినాలి' అని వ్రాసి రెండు కాగితాలు కలిపి లాటరీవేద్దాం. ఏ విధంగావస్తే అలా చేద్దాం. రెండో వాళ్ళు దానికి విరుద్ధంగా ప్రవర్తించకూడదు."

నాయుడుగారు ఎన్నో ఎన్నికల్లో నిలబడ్డారు, గెల్చారు. కాని ఇప్పుడెందుకో భయం వేసింది. అయినా తప్పలేదు. "సరే" అన్నారు.

సుబ్బారావు చకచకా కాగితం చింపి, రెండిటి మీద ఏదోవ్రాసి, చిన్నచిన్న మడతలుగా చుట్టి, రెండిటిని చేతిలోపట్టుకుని తండ్రివంకచూసాడు, 'రెడీ' యేనా అన్నట్లుగా.

తండ్రి తలూపిన మీదట, రెండు కాగితాలని గలగల లాడించి, టేబిలుమీద వేసాడు.

నాయుడుగారు ప్రక్కనేవున్న భార్యని ఒక కాగితం తీసి ఇమ్మన్నారు.

ఆమె అలాగే ఒక కాగితాన్ని తీసి భర్త చేతిలో వుంచింది.

తే
కే
ది
ం,
మాట
"సరే,
పెళ్ళి
మీకే
రో—

…ఉంటారో అంతా మీ ఇష్టం. నా పనల్లా మీరు చూపించిన అమ్మాయికి తాళి కట్టటం, అంతే!" అని సీరియస్‌గా బయటి కెళ్ళిపోయాడు.

నాయుడుగారికి పిచ్చి ఆనందంగా వుంది. ఈ సమస్య ఇంత త్వరగా, ఇంత లాభసాటిగా పరిష్కారమవుతుందని కల్లోగూడా అనుకో లేదు.

బల్ల మీద రెపరెప లాడుతున్న కాగితాన్ని చేతిలోకి తీసుకుని, "ఈ కాగితం తనకి అసాధ్యం అనుకున్న పెన్నిధిని తిరిగి తెచ్చి పెట్టింది. ఇది తన పాలిట రక్షరేకు" అనుకుంటూ ప్రక్కనవున్న రెండో కాగితాన్ని గూడా చేతిలోకి తీసుకుని "అదే కాగితం వచ్చి వుంటె, ఈ పాటికి తనీ పరిస్థితిలో వుండే వాడా? కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ వుండేవాడు" అనుకుంటూ రెండో కాగితాన్ని మడతలు విప్పి ఆసక్తిగా చదివారు.

అంతే!

అందులో వ్రాసివున్న దాన్నిచూసి అలాగే కూర్చుండి పోయారు. నోటమాట రాలేదు.

ఆ కాగితంలో గూడా, "నాన్నగారి మాటనే వినాలి" అని వ్రాసుంది.

కొద్ది సేపటికి తేరుకున్న నాయుడుగారు, కొడుకు తెలివి తేటల్ని తలుచుకుని మురిసి పోయారు. □


# శ్రీ బాలాజీ వైద్యశాల



## సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 26, నార్తుబోగ్ రోడ్, మద్రాసు-17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం-రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:-తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.